ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 35
సంచిక : 35
పేజీలు : 3

బుధవారం, సెప్టెంబర్ 10, 2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## యూరియాకు వచ్చి సొమ్మసిల్లిన రైతు



**టి మీడియా, సెప్టెంబర్ 9,అశ్వారావుపేట:** మండలంలో మంగళవారం యూరియా కోసం లైన్ లో నిలబడిన ఓ రైతు స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం బచ్చువారిగూడెం పంచాయితీ జెట్టి వారి గూడెం రైతు సింగరాజు ఉదయాన్నే నారాయణపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్దకు చేరుకున్నాడు.సిబ్బంది యూరియా పంపిణీ చేస్తుండగానే సింగరాజు అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై సొమ్మసిల్లి పడిపోయాడు. పక్కన ఉన్న రైతులు మంచినీళ్లు తాగించి అక్కడే ఉన్న కుర్చీ లో కూర్చోబెట్టారు.అయితే రైతు చెవిలో నుండి రక్తము రావడంతో సమీపంలోని హాస్పిటల్ కు తరలించి చికిత్స అందించి,ఇంటికి చేర్చారని నారాయణపురం సొసైటీ అధ్యక్షులు నిర్మల పుల్లారావు తెలిపారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మిగతా 2లో

# ఆర్టీసీ కార్మికుల ఆందోళన బాట

**-రీజియన్ పరిధిలో లేనివిధంగా అధిక పని భారం -తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడి**



**టి మీడియా, సెప్టెంబర్ 9,భద్రాచలం:** అంతర్రాష్ట్ర కూడలి భద్రాచలం ఆర్టీసీ డిపోలో శ్రమ దోపిడీ జరుగుతుందంటూ టిమ్ డ్రైవర్లు ఆందోళన బాట పట్టారు. డిపో మేనేజర్ ఒంటెద్దు పోకడలతో తమ ప్రాణాలు గాల్లో కలిసిపోతాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంప్లాయిస్ యూనియన్, ఎస్‌డబ్ల్యూఎఫ్, టీఎంయూ యూనియన్ల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నుండి ఆందోళన బాట పట్టిన సుమారు 60 మంది కార్మికులు తమ పోరాటాన్ని మంగళవారం కూడా కొనసాగిస్తున్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు విధులను బహిష్కరిస్తామంటూ టిమ్ డ్రైవర్లు తెగేసి చెబుతున్నారు. దీంతో యాజమాన్యం చేసేది లేక సోమవారం రాత్రి నుంచి పలుమార్లు చర్చలు జరిపినప్పటికీ విఫలమయ్యాయి. ఈ క్రమంలో కార్మికులు డిపో ఆవరణలోనే మంగళవారం ఉదయం అల్పాహారం తీసుకున్నారు. మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం, నిద్ర సైతం ఇక్కడే అంటూ డ్రైవర్లు పేర్కొన్నారు.

**శ్రమ దోపిడీ**

భద్రాచలం డిపో మేనేజర్గా తిరుపతి విధుల్లో చేరిన నాటి నుండి నూతన పోకడలకు శ్రీకారం చుడుతూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని టీమ్ డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో ఎక్కడా లేనిది భద్రాచలం డిపోలో పనిచేసే టీమ్ డ్రైవర్లపై అధిక పని భారం మోపుతూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నాడని కార్మికులు మండిపడుతున్నారు. ఒక్కొక్క టీమ్ డ్రైవర్ వారానికి 1,890 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని, భద్రాచలం నుండి హైదరాబాద్ సర్వీస్ నడిపే క్రమంలో టీమ్ డ్రైవర్లు నరకయాతన పడుతున్నారని, వాటర్ బాటిల్స్ సప్లై చేసే దగ్గర నుండి రిజర్వేషన్ చెక్ చేసుకోవడం, కార్గో పార్సిల్ సప్లై, పాసింజర్లకు టికెట్లు సరఫరా చేయడం వంటి పనులు ఉంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో కేవలం 7 గంటల్లోనే హైదరాబాద్ చేరుకోవాలంటూ నిబంధనలు పెడుతున్నారని, మిగులు ఆయిల్ ఉండాలంటూ వేధిస్తున్నారని, తద్వారా డ్రైవర్లు పని ఒత్తిడికి గురవుతున్నట్లు తెలిపారు.

**అర్హత లేని వారితో తోలకాలు**

గత కొన్ని రోజుల క్రితం సుమారు 8 మంది డ్రైవర్లు విధి నిర్వహణలోనే సిక్ అయ్యారని, ఇద్దరు, ముగ్గురు డ్రైవర్లు మార్గమధ్యలోనే ఆస్పత్రి పాలైనట్లు వెల్లడించారు. ప్రజలను సురక్షితంగా గమ్యానికి చేర్చాల్సిన తాము అధిక ఒత్తిడితో విధులు నిర్వహిస్తూ ఒక్కొక్కసారి ప్రయాణికులను గమ్యస్థానానికి సురక్షితంగా చేర్చలేమోననే ఆందోళన తీవ్ర మవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము విధులు బహిష్కరించడంతో డిపో మేనేజర్ అర్హత లేని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో హైదరాబాద్ సర్వీసులు నడిపిస్తున్నారని, నిబంధనల ప్రకారం ఔట్ సోర్సింగ్ డ్రైవర్లు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు తప్పా డీలక్స్, సూపర్ డీలక్స్, ఆపై సర్వీసులు నడుపరాదన్నారు. ఈ నేపథ్యంలో వారిని హైదరాబాద్ సర్వీసులకు పంపిస్తే ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ ఉండదని, డిపో మేనేజర్ ఆర్థిక లాభాలకు కక్కుర్తి పడుతూ తనకు మంచి పేరు రావాలనే దురుద్దేశంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని

మిగతా 3లో






## ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



**టి మీడియా, సెప్టెంబర్9, టేకులపల్లి** :మండలం రోళ్ళపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల భవనం, ఆవరణ, తరగతి గదులు, పరిశుభ్రతా స్థితిని పరిశీలించారు. విద్యార్థులతో సూటిగా మాట్లాడి వారికి అందుతున్న విద్యా సౌకర్యాలు, పాఠశాలలో అందిస్తున్న మిడ్-డే మీల్ నాణ్యత, వసతుల గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల పఠన, రచన నైపుణ్యాలను అంచనా వేసే క్రమంలో ఒకటవ తరగతి మరియు రెండవ తరగతి విద్యార్థులను బోర్డుపై వారి పేర్లు రాయమని సూచించి పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి ఆరోగ్యం, చదువు, అభివృద్ధి అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశాలని పేర్కొన్నారు. విద్యార్థులకు తగిన వసతులు, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన ఆహారం అందించడంలో ఎలాంటి లోపం చోటు చేసుకోరాదని స్పష్టంచేశారు. ప్రతిరోజూ నిర్ణీత మెనూ అమలు అవుతున్నదో లేదో తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు, బోధనా విధానాలను పరిశీలించిన కలెక్టర్ , అధికారులు తరచుగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని, నిర్లక్ష్యం లేదా లోపం తలెత్తితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించారు.పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ఉపాధ్యాయులు చిట్టిబాబు, పంచాయతీ సెక్రటరీ రాజు మరియు గ్రామస్తులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా విద్యా అధికారిగా అదనపు కలెక్టర్

- **ఎం.విద్యా చందనకు అదనపు బాధ్యతలు**

**టి మీడియా, సెప్టెంబర్ 9, పాల్వంచ**

జిల్లా విద్యా అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం జిల్లా విద్యా విభాగానికి సంబంధించిన పరిపాలనా, పర్యవేక్షణా కార్యక్రమాలు, పాఠశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాల మెరుగుదల, ఉపాధ్యాయుల పర్యవేక్షణ వంటి అంశాలను ఆమె సమన్వయం చేయనున్నారు.

## చిన్నారులకు పీఎస్ఆర్ ట్రస్ట్ ఉచిత షూస్ పంపిణీ

**పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**టి మీడియా, సెప్టెంబర్ 9,కూసుమంచి(ఖమ్మం):** పాలేరు నియోజకవర్గంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు ఉచితంగా షఉస్ పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ శ్రీకారం చుట్టింది.

మంగళవారం కూసుమంచి మండలం నరసింహులగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మంత్రి స్వయంగా 1 నుంచి 5వ తరగతి చదువుతున్న బాలబాలికలకు షఉస్ అందజేశారు. మిగిలిన ప్రాంతాల్లో ఆయా ప్రాంతాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ నిర్వహించారు.కూసుమంచి మండలంలోని 62 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1700 జతల షఉస్ పంపిణీ చేశారు. కొత్త షఉస్ అందుకున్న చిన్నారులు ఆనందంతో కళకళలాడారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ%" % " మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఎల్లప్పుడూ పేదల అంటే మక్కువ చూపే నాయకుడు. ఆయన సూచనల మేరకు పీఎస్ఆర్ ట్రస్ట్ తీసుకుంటున్న ఈ తరహా చర్యలు చిన్నారుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయి. ఒక చిన్న అవసరాన్ని తీర్చడం ద్వారా పిల్లల్లో చదువుపై ఆసక్తి పెంచడం మంత్రి ప్రత్యేకత". తల్లిదండ్రులకు వ్యయ భారాన్ని తగ్గించడంలో, చిన్నారులకు సౌకర్యం కల్పించడంలో పెద్ద సహాయం. ఇలాంటి సేవా చర్యలు మరిన్ని జరగాలని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు.



## పాము కాటుతో మహిళ మృతి



**టి మీడియా, సెప్టెంబర్ 9,ఎర్రుపాలెం :** పాము కాటుకు గురై మహిళ మృతి చెందిన సంఘటన ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రుపాలెం మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామానికి చెందిన శీలం సంధ్య, (40) సోమవారం రాత్రి సమయంలో ఇంటి ఆవరణంలో వాకింగ్ చేస్తుండగా పాము కాటుకు గురైంది. చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మరణించినట్లు తెలిపారు. సంధ్యకు భర్త, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భర్త శ్రీనివాసరావు రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినటలు ఎస్ఐ రమేశ్ తెలిపారు.



## 63 కేజీల ఏండు గంజాయి పట్టివేత..

**టి మీడియా, సెప్టెంబర్ 9,జూలూరుపాడు :** అక్రమంగా తరలిస్తున్న 63 కిలోల ఎండు గంజాయిని పట్టుకొని ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు జూలురుపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు.రాజమండ్రికి చెందిన ఎళ్ల భాస్కర్ రావు,అశ్వాపురం మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన డ్రైవర్ కొండా తేజ్ కుమార్, నాగరాజు, పుణెకు చెందిన ఏలు, ఒరిస్సాకు చెందిన ఆజాద్ ఐదుగురు వ్యక్తులు కలిసి మద్యానికి బానిసై డబ్బులు సంపాదించాలనే ఆశతో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఒరిస్సా రాష్ట్రం నుండి రూ.35.74 లక్షల విలువైన 63 కేజీల ఎండు గంజాయిని బొలోరో వాహనంలో పుణెకు తరలిస్తున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై బాదావత్ రవి తన సిబ్బందితో కలిసి మండలంలోని మాచినేనిపేట తండా గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. గంజాయిని స్వాధీనం చేసుకొని వాహనాన్నిసీజ్ చేసి వాహనంలో ఉన్న తేజ్ కుమార్, భాస్కర్ రావులను అదుపులోకి తీసుకొని విచారణ చేసినట్లు తెలిపారు. ఐదుగురు కలిసి పుణెకు గంజాయిని తరలిస్తున్నట్లు వారు అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా మిగిలిన ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. విలేకర్ల సమావేశంలో ఎస్సై రవి, సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యార్థినిలకు సైకిళ్లు పంపిణీ

**టి మీడియా, సెప్టెంబర్ 9,పినపాక ప్రతినిధి:**బూర్గంపాడు మండలం, సారపాక గ్రామపంచాయతీ పరిధిలోని మసీద్ రోడ్డు లో వున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రెడ్డిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని నాగినేని ప్రోలు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు బూర్గంపాడు గ్రామపంచాయతీలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినిలకు ఐటిసి స్పాన్సర్ చేసిన సైకిళ్లను మంగళవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఐటీసీ యాజమాన్యానికి ఇలాంటి మహోత్తరమైన కార్యక్రమాన్ని చేపట్టాలని కోరగా అడిగిందే తడవుగా మంజూరు చేసిన ఐటిసి యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలోని ట్రైబల్ విద్యార్థినిలకు 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదివే విద్యార్థినిలకు 36 ఉచిత సైకిళ్లను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ మీద ప్రత్యేక దృష్టి సారించిందని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, విశాలమైన పాఠశాల ప్రాంగణాలు, చక్కని తరగతి గదులు, పౌష్టిక ఆహారం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, మరెన్నో సదుపాయాలని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐ టి సి మేనేజర్ చంగళరావు, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంఈఓ రాజు , ప్రధానోపాధ్యాయులు పద్మ, నరసింహారాజు, ధుడ , ఉపాధ్యాయులు, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుగ్గంపూడి కృష్ణారెడ్డి , మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ హైవే వరకు కొత్త రోడ్డు నిర్మించాలి

**టీ మీడియా, సెప్టెంబర్ 9,కొణిజర్ల**

మండల కేంద్రానికి అతి సమీపంలో బస్వాపురం నుండి గోపవరం గ్రామం వరకు ధ్వంసం అయిన రోడ్డు స్థానంలో కొత్త రోడ్డు నిర్మించాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు డిమాండ్ చేశారు .మంగళవారం ఉదయం గోపవరం గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) స్థానిక గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి మంగా చెన్నారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, తాళ్లపల్లి కృష్ణ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలకు పూర్వం నుంచి గోపారం గ్రామం పక్కనుంచే గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు ప్రారంభించారు పనులు ప్రారంభం నాటి నుంచి గ్రీన్ ఫీల్డ్ హైవే కి మట్టి,రోడ్డు నిర్మాణానికి సంబంధించినటువంటి మెటీరియల్ తోలేటటువంటి నిమిత్తం పెద్ద పెద్ద లారీలతో రోడ్డు కెపాసిటీకి మించి లోడుతో లారీలు



ప్రయాణించటం వల్ల ఆ రోడ్డంతా కూడా పూర్తిగా ధ్వంసం అయిపోయింది. కొణిజర్ల మండల కేంద్రం నుంచి బోనకల్లు మండల కేంద్రానికి లింకు లింకు రహదారిగా ఉన్న ఈ రోడ్డులో ఈ రెండు గ్రామాల మధ్య సుమారు రెండు కిలోమీటర్లు మేర వాహనాలు ప్రయాణం చేయడానికి వీలు లేకుండా పాడైపోయింది. వేలాదిమంది ప్రయాణికులు టూవీలర్లు ఆటోలు, స్కూల్ బస్సులు, కార్లు అనేక వాహనాలతో ప్రయాణం చేసే ఈ రోడ్డు ఈ రెండు గ్రామాల మధ్య అధ్వానంగా తయారైంది. ఇటీవల కాలంలో కురిసిన భారీ వర్షాలకు మరింతగా పాడైపోయి తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి కాళ్లు చేతులు ఇరగటం మరియు



వాహనాలన్నీ కూడా పాడైపోతునన్నాయి. ఈ రోడ్డును ఆర్ అండ్ బి ప్రభుత్వ అధికారులు, గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారులు మరియు జిల్లా మంత్రులు స్థానిక వైరా ఎమ్మెల్యే ఇట్టి విషయాన్ని పరిశీలించి సాధ్యమైనంత తొందరగా ఈ రోడ్డు పునర్నిర్మానం చేయాలని చెప్పేసి సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తూ ఉంది. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు కొప్పుల కృష్ణయ్య సిపిఐ (ఎం) కొంజర్ల మండలం కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు స్థానిక శాఖ కార్యదర్శి మురికిపూడి నాగేశ్వరరావు తాటిపల్లి శ్రీను తూము రామచంద్రరావు కనపర్తి హనుమంతరావు బొమ్మకంటి వెంకటేశ్వర్లు పిడియాల వెంకులు పాల్గొన్నారు.



## భాషా దినోత్సవ వేడుకలు

**టి మీడియా, సెప్టెంబర్ 9,పినపాక ప్రతినిధి:**

మణుగూరు పివి కాలనీలోని సింగరేణి పాఠశాలలో మంగళవారం ప్రజా కవి కాలోజి నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ముందుగాపాఠశాలప్రధానోపాధ్యాయురాలు ఆర్. కళ్యాణి కాళోజి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులందరూ కాళోజి చిత్రపటానికి పూలు సమర్పించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం ఆర్ కళ్యాణి మాట్లాడుతూ, కాళోజీ చిన్ననాటి నుంచే ఎంతో ధైర్య సాహసాలతో తెలంగాణ స్వాతంత్ర పోరాటంలోనూ, మరియు రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలోనూ పాల్గొని అనేకసార్లు జైలుశిక్ష అనుభవించారని, గొప్ప పోరాటయోధుడు తెలంగాణ వైతాళికుడు ప్రజాకవి కాలోజీ నారాయణరావును మనమంతా స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని తెలిపారు . పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ఎం.వేణు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, సైన్స్ ఉపాధ్యాయులు దయానంద్ మాట్లాడుతూ, కాళోజి పూర్తిని కొనసాగిస్తూ, తెలంగాణ భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని, విద్యార్థులంతా తెలంగాణ మాండలికాన్ని ఆకలింపు చేసుకొని భాష మాధుర్యాన్ని చాటి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు మస్తానయ్య, పి.టి సాహిద్ , సుశీల, స్రవంతి, లక్ష్మి, రజిత కళ్యాణ్ కుమార్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## వై.యస్.ఆర్.సీ.పీ అన్నదాత పోరు ర్యాలీ

**టీ.మీడియా,సెప్టెంబర్9,చింతూరు:** మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు ఈ రోజు అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజవర్గం చింతూరు మండలం చింతూరులో చంద్రబాబు కూటమి ప్రభుత్వం రైతన్నకు చేసిన మోసాలు రాష్ట్రంలో యూరియా %ఊ% ఎరువుల కోసం రైతులు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు ప్రభుత్వం మొద్దు నిద్రపోతోంది.ఈ సమస్యలను రైతులతో కలిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి వై ఎస్ ఆర్ సీపీఆధ్వర్యంలో చింతూరు ఐటిడిఏ ఏ పీఓ గారికి వినతి పత్రం అందజేసిన గౌరవ ఎమ్మెల్సీ అనంత బాబు గౌరవ మాజీ ఎమ్మెల్యే రంపచోడవరం నియోజకవర్గం ఇంచార్జ్ నాగులపల్లి ధనలక్ష్మి , ఈ కార్యక్రమంలో చింతూరు, కూనవరం, వి ఆర్ పురం, ఎటపాక, రంపచోడవరం మండల పార్టీ అధ్యక్షులు, జడ్పిటీసీలు ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జిల్లా బీసీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచులు, వైస్ సర్పంచులు, వార్డు మెంబర్లు, జిల్లా అధికార ప్రతినిధి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## పామాయిల్ పరిశ్రమలకు రెండు రోజులు సెలవులు

**జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి**



**టి మీడియా, సెప్టెంబర్ 9, అశ్వారావుపేట:** పరిశ్రమల సామర్థ్యం మించి పామాయిల్ గెలలు దిగుమతి అవుతుండటంతో యంత్రాల నిర్వహణ పనుల నిమిత్తం ఆయిల్ ఫెడ్ అధికారులు పరిశ్రమలకు రెండు రోజులు సెలవులు ప్రకటించారు. గత వారంలో అధిక వర్షాల కారణంగా రెండు ఫ్యాక్టరీలు కు నిరంతరాయంగా గెలలు ఎక్కువగా వస్తున్న తరుణంలో సెప్టెంబర్ 10,11 (బుధ,గురు వారాల్లో) తేదీల్లో అప్పారావు పేట, అశ్వారావుపేట ఫ్యాక్టరీలకు సెలవు ప్రకటించినట్లు ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి మంగళవారం ప్రకటించారు. కావున రైతు సోదరులు సహకరించి ఈ నెల 12 వ తేదీ శుక్రవారం నుంచి యధావిధిగా రెండు ఫ్యాక్టరీలకు గెలలు సరఫరా చేయాలని పరిశ్రమల మేనేజర్లు కళ్యాణ్ గౌడ్, నాగబాబులు విజ్ఞప్తి చేసారు.



## కాళోజిని నేటి సమాజం స్ఫూర్తిగా తీసుకోవాలి

**టి మీడియా, సెప్టెంబర్ 9,పినపాక ప్రతినిధి:**పుట్టుక నీది- చావు నీదిబతుకంతా దేశానిదని,తెలంగాణ సామాజిక చైతన్య స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనం ప్రజాకవి కాళోజి నారాయణరావు అని తహసిల్దార్ మణిధర్ అన్నారు. మంగళవారం అశ్వాపురం తహసిల్దార్ కార్యాలయంలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తహసిల్దార్ మణిధర్ కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాళోజి తన సాహిత్యంతో తెలంగాణ ప్రాంత అస్తిత్వాన్ని తట్టిలేపి, తెలంగాణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ప్రజల మనిషి, తన కవిత్వంతో స్వరాష్ట్ర ఆకాంక్షను రగిలించిన ప్రజాకవి అని ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యూరియాకు వచ్చి సొమ్మసిల్లిన రైతు

పెంట్యాల రవికుమార్ హుటాహుటిన నారాయణపురం చేరుకుని విచారించారు.రైతు సింగరాజు స్వల్ప అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. మంగళవారం నాటికి అశ్వారావుపేట సొసైటీలో 200,నారాయణపురం సొసైటీలో 450 బస్తాల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. 5 ఎకరాలు లోపు 2 బస్తాలు,5 పైన ఉన్న రైతులకు అవసరాన్ని బట్టి యూరియా సరఫరా చేస్తున్నామని అన్నారు. రైతులు ఎవరూ ఆందోళన పడవద్దని భరోసా ఇచ్చారు. ఈయన వెంట ఏవో శివరాం ప్రసాద్, ఏఈఓ షకీరా భాను లు ఉన్నారు.



## ఒడ్డుగూడెం పాఠశాల విద్యార్థులకు బ్యాగులు వితరణ

**టీ మీడియా,సెప్టెంబర్ 09, సింగరేణి (కారేపల్లి):**
కారేపల్లి మండలం ఒడ్డుగూడెం ప్రాథమిక పాఠశాల టీఎస్‌యూటీఫ్ నాయకులు బానోత్ మంగీలాల్ చొరవతో అతని మిత్రులు విద్యార్థులకు మంగళవారం స్కూల్ బ్యాంగులు వితరణ చేశారు. మను, తృప్తేష్ షా, రామన్, జయసుధ, సంజయ్ పంచాల్ ఆర్థిక సాయంతో కొనుగోలు చేసిన బ్యాగులను ఎంఈవో దుగ్గిరాల జయరాజు, కాంప్లెక్స్ హెచ్‌ఎం తేజావత్ శారధ చేతుల మీదిగా విద్యార్థులకు అందజేశారు. దాతలను ఎంఈవో జయరాజు అభినందించారు. ఈసందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న ఎంఈవో దుగ్గిరాల జయరాజును సన్మానించారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు బానోత్ మంగీలాల్, హెచ్‌ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఆది కర్మయోగి పథకం

**టీ మీడియా, సెప్టెంబర్ 09,సింగరేణి (కారేపల్లి) :**
గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఆది కర్మయోగి పథకం తీసుకవచ్చిందని సింగరేణి ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కారేపల్లి హైస్కూల్‌లో జరిగిన అవగాహన సదస్సులో ఎంపీడీవో మాట్లాడుతూ గిరిజన సమాజం విద్య, ఆరోగ్యం, పోషకాహారం, జీవనోపాధిలో లోపాలను ఎదుర్కొంటున్నాయన్నారు. ఆ సమస్యలు రూపుమాపేందుకు లక్షలాది మంది శిక్షణ పొందిన కార్యకర్తల ద్వారా కృషి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయిలో సేవలను మెరుగుపరచడం, గిరిజన సంస్కృతిని, సంరక్షించడం, స్థానిక ప్రజల ప్రోత్సహించడం ఈ పథకం ముఖ్య లక్ష్యాలన్నారు. దీనిలో ప్రతి ఒక్కరు స్వచ్ఛంధంగా భాగస్వాములు కావచ్చన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ సూర్యం, ఏఎల్‌వో ఎల్.రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

**టీ మీడియా, సెప్టెంబర్ 09, ముదిగొండ :**
ముదిగొండ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను తహశీల్దార్ సునీతా ఎలిజబెత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రెవిన్యూ సిబ్బంది అందరూ కలిసి కాళోజీ చిత్ర పటానికి పూల మాలలు, పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సునీతా మాట్లాడుతూ తెలంగాణ యాసలో సామాజిక రచనలు చేసి ప్రజలను చైతన్యపర్చిన ప్రజాకవి, సామాజిక ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు అని తెలంగాణ మాండలికంలో సామాజిక రచనలు చేస్తూ తెలంగాణ ప్రజలను సామాజికంగా మేల్కొల్పిన గొప్ప ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని, ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం పద్మవిభూషణ్ బిరుదుతో గౌరవించిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి అధికారికంగా కాళోజీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ భావితరాలకు ఆయన స్ఫూర్తిని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీ, రెవిన్యూ ఇన్స్పెక్టర్ కళ్యాణి,సీనియర్ అసిస్టెంట్ నాగలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్లు రమా దేవి, జాన్ పాషా,అబ్బాస్, కర్ణ, భూ భారతి ఆపరేటర్ శ్రీ హరి,అటెండర్లు నాగుల్ మీరా,నిహారిక పాల్గొన్నారు.



# విప్లవ ధృవతార ఐలమ్మ

- దొరల పెత్తనాన్ని ఎదిరించిన ధీశాలి
- తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళల పాత్ర వీరోచితం
- ఐలమ్మ ట్రస్ట్ కార్యదర్శి బత్తుల హైమావతి, చైర్మన్ బుగ్గవీటి సరళ



**టీ మీడియా, సెప్టెంబర్ 09, ఖమ్మం**
మెరిసే విప్లవ ధ్రువతార.. దొరల పెత్తనాన్ని ఎదురించిన ధీశాలి చిట్యాల ఐలమ్మ, మల్లు స్వరాజ్యమని ఐద్వా సీనియర్ రాష్ట్ర నాయకురాలు, ఐలమ్మ ట్రస్ట్ కార్యదర్శి బత్తుల హైమావతి, చైర్మన్ బుగ్గవీటి సరళ అన్నారు. స్థానిక టేకులపల్లిలో మంగళవారం రాత్రి జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళలు వీరోచిత పోరాటం నిర్వహించారని తెలిపారు. మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి, కొండపల్లి దుర్గాదేవి... ఇలా అనేకమంది వీరనారీమణులు చూపించిన తెగువ ఆదర్శనీయమన్నారు. రజాకార్లను తరిమికొట్టిన వందలాదిమంది వీర వనితల స్ఫూర్తితో మహిళలు ముందుకు సాగాలన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి దారి చూపిన వీరమాత చిట్యాల ఐలమ్మ అన్నారు. సాయుధ పోరాటానికి ఆమె భూ సమస్యే వేదికైందన్నారు. తొలి భూపోరాటానికి నాంది పలికిందని తెలిపారు. దొరలు ఆక్రమించిన భూమిపై ప్రతిఘటించి విజయం సాధించారన్నారు. ఆమె ధీర చరిత్ర ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొంది ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శి బండి పద్మ, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ రమ్య, ఐద్వా హవేలీ అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, అమరావతి, సునీత తదితరులు పాల్గొన్నారు.



# మత్తులో యువకుల వీరంగం..

**-పోలీసుల అదుపులో ఇద్దరు.. పరారీలో ఒకడు**

**టి మీడియా, సెప్టెంబర్ 9, తొర్రూరు :** గంజాయి మత్తులో ముగ్గురు యువకులు వీరంగం సృష్టించారు. దారినపోయే వాహనాలను ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. ఇవ్వకపోతే దాడులకు పాల్పడ్డారు. వాహనాల డ్రైవర్లను, క్లీనర్లను రాళ్లతో కొట్టారు. వాహనాల అద్దాలు పగులగొట్టారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలో ఈ ఘటన చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ ఉప్పల్‌లోని చిలుకానగర్‌కు చెందిన తోల్ల అభిలాష్ తన క్లీనర్ చిన్నతో కలిసి, డీసీఎం వాహనం లో మిషన్ బేరింగుల లోడుతో జార?ండ్‌కు, రాజమండ్రికి చెందిన పెద్దపాటి రాంబాబు తన లారీ లో కోళ్ల దాణా లోడుతో మహారాష్ట్ర నుంచి నూజివీడుకు సోమవారం రాత్రి వెళ్తున్నారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో తొర్రూరు పట్టణ పరిధిలోని దుబ్బతండా సమీపానికి ఆ వాహనాలు చేరుకున్నాయి.అక్కడ గంజాయి మత్తులో ఉన్న ముగ్గురు యువకులు వాహనాలను అడ్డగించారు. 'పర్మిట్ చూపించాలని, లేదంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించిన డ్రైవర్ రాంబాబుపై రాళ్లతో దాడిచేసి గాయపరిచారు. ఆ తర్వాత లారీ, డీసీఎం వాహనాల అద్దాలను పగలగొట్టి భయాందోళనలకు గురిచేశారు. వెంటనే బాధితులు 100 నంబర్‌కు సమాచారం ఇవ్వగా తొర్రూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. ఘటనపై బాధిత డ్రైవర్లు మాట్లాడుతూ.. తమకంటే ముందు కూడా మూడు నాలుగు వాహనాలను ఇలాగే ఆపేందుకు ప్రయత్నించారని, తాము దొరికి నష్టపోయామని చెప్పారు. తాము ఎప్పుడూ తొర్రూరు మీదుగానే వెళ్తుంటామని, కానీ ఇలా జరగడం మొదటిసారని అన్నారు. ఘటనపై ఎస్సై గొల్లమూడు ఉపేందర్ వివరణ కోరగా.. ఘటన గురించి వివరాలు తెలిపారు.వీరంగం చేసిన యువకులు గంజాయి సేవించలేదని, మద్యం మత్తులోనే అంతా చేశారని చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు. పరారీలో ఉన్న వ్యక్తిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

## ఆర్టీసీ కార్మికుల ఆందోళన బాట

కార్మికులు మండిపడ్డారు.

**అధికారి అండతో వేధిస్తున్న సూపర్‌వైజర్లు**

భద్రాచలం డిపో అధికారి అండతో సూపర్‌వైజర్లు (ఏడీసీలు) ఆర్టీసీ కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆరోగ్యం బాగా లేకున్నా, కుటుంబ సభ్యులకు, బంధువులకు బాగా లేకున్నా సెలవు కావాలంటే సూపర్‌వైజర్ల ముందు పడిగాపులు కాయాల్సిందే. వాళ్లకు అనుకూలంగా ఉన్న వారికి సెలవులు ఇస్తూ, మిగిలిన వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు ఆర్టీసీ కార్మికులు వాపోయారు. ఇటీవల ఒక డ్రైవర్ తనకు ఆరోగ్యం బాగా లేదు. ఆస్పత్రికి వెళ్లేందుకు సెలవు కావాలంటే డ్యూటీకి వెళ్లాల్సిందే అని బలవంతంగా డ్యూటీకి పంపించారు. అలాంటి సమయంలో తనకు ఏమైనా అయితే కుటుంబ పరిస్థితి ఏంటని సదరు డ్రైవర్ వాపోయాడు.

**ఇకనైనా దయ చూపండి**

పని భారంతో డ్రైవర్లు మానసిక ఒత్తిడికి లోనై అనారోగ్యాల పాలవుతున్నారని, ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికైనా టీం డ్రైవర్ల పై దయ చూపాలని ఆందోళన బాట పట్టిన కార్మికులు కోరారు. లాంగ్ సర్వీసులకు కండక్టర్ ని ఇవ్వాలని, కిలోమీటర్లు తగ్గించాలని, మిగతా డిపోల మాదిరిగానే భద్రాచలం డిపోలో విధులు మాస్టర్లు సరి చేయాలని, కార్మికుల ఆరోగ్యాల పట్ల యాజమాన్యం శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## భట్టిని కలిసిన మధిర ప్రెస్ క్లబ్

**టీ మీడియా, సెప్టెంబర్ 09, మధిర**
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మంగళవారం మధిర క్యాంప్ కార్యాలయంలో మధిర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ వర్కింగ్ జర్నలిస్టుల ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మధిర ప్రెస్ క్లబ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు నాళ్ళ శ్రీనివాసరావు, గౌరవ సలహాదారులు తమ్మారపు బ్రహ్మం, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జివి, అరుణ్ ప్రచార కార్యదర్శి అర్జున్, కోశాధికారి కాకరపర్తి శ్రీనివాసరావు, ఉప కోశాధికారి శ్రీధర్, సహాయ కార్యదర్శిలు సుధీర్, వాసు, మహంకాళి వెంకట శ్రీనివాసరావు చారుగొండ్ల నరసింహమూర్తి, బాణాల శంకరాచారి, కార్యవర్గ సభ్యులు విజయ భాస్కర్, ప్రభాకర్, నర్సిరెడ్డి, పాల్గొన్నారు

